







అభినవ శివాజీ నరేంద్ర మోదీ

- కాపులను గుర్తించింది బీజేపీనే
- ఎంపీ ధర్మపురి అర్వింద్


నగరంలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అర్వింద్, పక్కన దినేష్ కులాచారి

నిజామాబాద్‌నాగారం: కాపులను గుర్తించింది బీజేపీయేనని.. అసలు సిసలైన కాపు బిడ్డ నరేంద్ర మోదీ అని.. అభినవ శివాజీ మోదీయేనని.. ఒక్క పైసా అవినీతి లేకుండా దేశంలో మోదీ పాలన సాగుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరి ్వంద్ కొనియాడారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా దినేష్ కులాచారీ నూతనంగా ఎన్నికైన సందర్భంతో పాటు, జిల్లా మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. రూరల్ అసెంబ్లీ ఎన్నికల్లో 49వేల ఓట్లు సాధించి దినేష్ పటేల్ కులాచారి సత్తా చాటారన్నారు. బీజేపీ ప్రభుత్వం మున్నూరు కాపులు, బీసీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. జిల్లాలో 40 సంవత్సరాల నుంచి రైతుల కడుపు మంట తీర్చానని, తాను చరిత్రలో నిలుస్తానన్నారు. పసుపు బోర్డు కలను నెరవేర్చిన ఘనత మోదీ ప్రభుత్వానిదే అన్నారు. పసుపుకు రూ.14500 ధర ఉందని, రానున్న రోజుల్లో రూ.20 వేలకు పైగా ఉండబోతుందన్నారు. వరి, చెరుకు మద్దతు ధర పెంచుతామన్నారు. అందరు బీజేపీకి అండగా ఉండాలన్నారు. ఎంపీ అర్వింద్, దినేష్‌కులచారీలను ఘనంగా సత్కరించారు. అంతకుముందు శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కాపు సంఘం కోశాధికారి ధర్మపురి సురేందర్, కార్పొరేటర్లు న్యాలంరాజు, ప్రవళిక శ్రీధర్, వైష్ణవి రాము, పంచరెడ్డి లావణ్య లింగం, నాయకులు నాగోల్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

– ఆర్టీఐ పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)పై అవగాహన కలిగి ఉండాలని ఆర్టీఐ పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరక్టర్ ఎంఏ సలీం సూచించారు. ఆదివారం బర్దీపూర్ శివారు బైపాస్ రోడ్డులో గల తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలలో సమాచార హక్కు చట్టం –2005పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌టీఐను ఉపయోగించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పరిపాలన సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఆర్‌టీఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆదే ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సలహాదారులు మద్ద చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు రావటం అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: యువత, సంఘ సేవకు ముందుకు రావటం అభినందనీయమని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. ఆదివారం నగరంలోని పోచమ్మగల్లీ ఎస్సీ మాల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సభ్యులు అందరికి ఆదర్శంగా ఉండాలని, సంఘ అభివృద్ధికి వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు పులి జైపాల్, కార్యదర్శి నీలగిరి చందు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం


ప్రారంభిస్తున్న హితిన్ బీమాని

సుభాష్‌నగర్: నగరశివారులోని గంగస్థాన్ ఫేజ్–2 లోగల రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో మాధవ స్మారక సేవా సమితి ఇందూరు ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఉపాధ్యక్షుడు హితిన్ బీమాని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవా సమితి కార్యదర్శి మర్ని కృష్ణారెడ్డి, కోశాధికారి గణేష్, కార్యవర్గసభ్యులు, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు గురుచరణం, నగర అధ్యక్షుడు డైట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి 60వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. రూరల్ నియోజకవర్గ కార్యకర్తలు సోమవారం ధర్మారం(బి) శివారులోని పీహెచ్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరుకానున్నారు. అంతకుముందు ఉదయం 9.30 గంటలకు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకనున్నారు. హాస్టళ్లు, కేజీబీవీలు, పీహెచ్‌సీల్లో పండ్ల పంపిణీ, పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ, ఇతర సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు.

రైతు సదస్సును విజయవంతం చెయ్యండి

డిచ్‌పల్లి: చెరుకు ఉత్పత్తిదారులు సంఘం, రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో), అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని జిల్లా నాయకులు దేవసామి కోరారు. ఆదివారం డిచ్‌పల్లిలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతోందన్నారు. 'రైతులను రక్షించుకుందాం – వ్యవసాయాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతు సదస్సును జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు సాయినాథ్, దాస్, జేపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో నిజామాబాద్ బాలికల ప్రతిభ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓపెన్ స్టేట్ స్కేటింగ్ కాంపిటీషన్‌లో నిజామాబాద్ బాలికలు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. స్కేటింగ్ పోటీల్లో మొదటి స్థానం ఎం.సహస్ర (నిజామాబాద్), ద్వితీయ స్థానం వై.మనోజ్ఞ (టీఎస్ఎస్‌పీ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి), తృతీయస్థానం ఆర్.మనస్విని (నిజామాబాద్) సాధించారు.

క్లుప్తంగా

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించడం హర్షణీయం

సిరికొండ: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఐచ్ఛిక సెలవు దినంగా ప్రకటించడం పట్ల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల నాయకుడు సంతోష్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దూప్యాతండాలో సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

జయంతిని ప్రశాంతంగా జరుపుకోనివ్వాలి

ఇందల్వాయి: మండలంలోని జాతీయ రహదారి పక్కన వివాదాస్పద సర్వే నంబరు–728/20లో ఉన్న సేవాలాల్ ఆలయంలో ఈ నెలలో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఇందల్వాయి మండల బంజారా సేవా సంఘం సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. గతంలో ఇదే స్థలంలో ప్రార్థనలు చేయగా స్థానిక ముస్లింలు అడ్డుకున్న నేపథ్యంలో వారు ముందస్తుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిఖత్‌కు రజత పతకం

నిజామాబాద్‌నాగారం: బాక్సింగ్ బాద్‌షా నిఖత్ జరీన్ ఫైనల్ మ్యాచ్‌లో పోరాడి ఓడి రజత పతకం సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన క్రీడాకారిణితో పోరాడి 3–2తో నిఖత్ ఓడింది. ఈ సందర్భంగా జిల్లాలోని క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి

జక్రాన్‌పల్లి: గ్రామంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. ఆదివారం తొర్లికొండలో ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

మేడుదుల సునీతకు పురస్కారం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మహాలక్ష్మీనగర్‌కు చెందిన మేడుదుల సునీతకు ఆంధ్ర ప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు సంస్కృతి సేవా ట్రస్ట్, స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు సంస్కృతి సేవా స్వర్ణనంది జాతీయ పురస్కారం అందజేశారు. ఆదివారం విజయవాడ చిట్టినగర్ విశ్వబ్రహ్మణ కల్యాణ మండపంలో యోగివేమన, శ్రీ కృష్ణ దేవరాయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు మచావరం గౌరి శంకర్ తెలిపారు. సంస్థ చైర్మన్ రాజేశ్వరీ, కో చైర్మన్ ఎస్ఎస్ శ్రీనివాస్‌లు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

సిరికొండ: తాళ్లరామడుగు రామాలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు మురళి, మాజీ అధ్యక్షుడు రాజు, శ్రీనివాస్, మారుతి, ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

బంద్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 16న ఆటో, క్యాబ్ మోటార్ రవాణా బంద్‌కు పిలుపునిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ నగరంలో బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకుండానే ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డును పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బచ్చల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రుబాయిరాగాలు పుస్తకావిష్కరణ



నిజామాబాద్ సిటీ: హైదరాబాద్ ఎన్‌టీఆర్ స్టేడియంలో ఆదివారం గజల్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ప్రముఖ ఇందూర్ కవి, ఉపాధ్యాయుడు కాసర్ల నరేష్‌రావు రచించిన రుబాయిరాగాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. గజల్ సాహిత్యవేదిక అధ్యక్షుడు ఇరువెంటి వేంకటేశ్వర శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు జస్టిస్ మాల్యాద్రి పుస్తకాన్ని ఆవిష్కరించి, ప్రముఖ గజల్ కవి మాధవరావుకు తొలిప్రతిని అందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిజామాబాద్‌అర్బన్: టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో అంబేడ్కర్ భవన్‌లో సంఘం సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, సమస్యలన్నీ దశల వారీగా పరిష్కారమవుతాయన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.













